- జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఖాళీ
- భద్రాద్రి జిల్లాలో బీఆర్ఎస్‌కు భారీ షాక్, భద్రాచలంలో నిస్తేజం
- ఉన్న ఒక్కగానొక్క ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరిక, నైరాశ్యంలో బీఆర్ఎస్
- బీఆర్ఎస్‌పై పొంగులేటి చేసిన సవాల్ నెరవేరిన వైనం

# నెరవేరిన పొంగులేటి శపథం





ప్రత్యేక ప్రతినిధి, కెరటం న్యూస్



పొంగులేటి అంటే ఫ్లవరనుకుంటివా... ఫైరూ.. ఒకే ఒక్క మాట చెపుతున్నా జాగ్రత్తగా వినండి.. రాసిపెట్టుకోండి.. ఒక్కరంటే ఒక్కరు కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ గేటు తాకనివ్వను.. శీనన్న చెప్పిండంటే ఎంతవరకైనా వెళతాడు.. చెప్పిందే చేస్తాడు.. చేసేదే చెపుతాడు.. హెూరా హెూరీగా గత డిసెంబర్ నెలలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో నేరుగా సీఎం కేసీఆర్‌కే సవాల్ విసిరి తన సత్తా ఏంటో చెప్పకనే సవాల్ విసిరిన నాయకుడు ఎవరో ఇప్పటికే మీకు అర్థమై ఉంటుంది.. అవునే అతనే రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. నాడు సీఎం కేసీఆర్‌కు ఏ సమయంలో చాలెంజ్ చేశాడో ఏమో కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కరు కూడా లేకుండా పోయారు. ఎన్నికలకు ముందు ఎంతో పటిష్టంగా కనిపించి, శాసనసభ ఎన్నికల్లో పదికి పది గెలుస్తామని ధీమాగా ఎన్నికల్లోకి దిగిన బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లాలో దిగ్గజ నాయకులైన తుమ్మల, పొంగులేటిని పోగొట్టుకుని భారీ మూల్యం చెల్లించుకుందన్న చర్చ జరుగుతోంది. ఒక విషయానికి వస్తే ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ తరపున గెలిచిన ఒక్కగానొక్క భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకటరావు ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గులాబీ పార్టీ ఖాళీ అయింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఏకైక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఆ పార్టీని వీడటంతో బీఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ అయింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో ఆ పార్టీకి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ఏకైక ఎమ్మెల్యే జారిపోయి నట్లయింది.

### పదికి పది స్థానాల్లో కాంగ్రెస్..

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గత ఎన్నికలకు ముందు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కు చేసిన సవాల్ పూర్తి స్థాయిలో నెగ్గింది. "ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఏ ఒక్క టీఆర్ఎస్ అభ్యర్థిని అసెంబ్లీ గేటు తాకనివ్వను.." అని పొంగులేటి చేసిన శపథం నెరవేరింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 10 స్థానాల్లో ఎనిమిది స్థానాలను కాంగ్రెస్ పార్టీ అఖండ మెజారిటీతో కైవసం చేసుకోగా పొత్తు నేపథ్యంలో సీపీఐకి కేటాయించిన కొత్తగూడెంలోనూ కాంగ్రెస్ కూటమి నెగ్గింది. దీంతో 9 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించినట్లయింది. కాగా భద్రాచలం స్థానంలో ప్రముఖ వైద్యుడు తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. అయితే ఎన్నికల ఫలితాల్లో ఆయన విజయం సాధించినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరతారన్న ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో రెండు పర్యాయాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడంతో పాటు మహబూబాబాద్ ఎంపీ నియోజకవర్గ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సైతం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పాల్గొనడం తీవ్ర చర్చకు దారితీసింది. అలాగే శనివారం సాయంత్రం పార్టీ అగ్రనేత రాహుల్ నేతృత్వంలో హైదరాబాదులోని తుక్కుగూడలో జరిగిన భారీ బహిరంగ సభలోనూ వెంకటరావు పాల్గొనడంతో కాంగ్రెస్ లో ఆయన చేరిక ఖాయంగానే స్పష్టమైంది. తాజాగా ఆదివారం ఎమ్మెల్యే వెంకట్రావు ముఖ్యమంత్రి రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం అందరి అనుమానాలను నివృత్తి చేసింది. ఎమ్మెల్యే చేరికతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా ఖాళీ అయింది. అలాగే కాంగ్రెస్ పార్టీ పదికి పది స్థానాల్లో తమ ఎమ్మెల్యేలను పదిలం చేసుకొని పూర్తిస్థాయి మెజారిటీని నిలుపుకుంది.

### ఉన్న ఒక్కగానొక్క ఎమ్మెల్యే కాంగ్రెస్‌లోకి

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు మొదటి నుంచి తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని, ఆ పార్టీ అధినేత కేసిఆర్ ను విశ్వసించలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ తరఫున కొత్తగూడెం స్థానం నుంచి జలగం వెంకట్రావు ఒక్కరే గెలుపొందారు. అలాగే 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఖమ్మం స్థానం నుంచి పువ్వాడ అజయ్ కుమార్ ఒక్కరే విజయం సాధించారు. గత చరిత్రను పునరావృతం చేస్తూ 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఏకైక స్థానం మాత్రమే బీఆర్ఎస్ పార్టీకి దక్కింది. భద్రాచలం నుంచి తెల్లం వెంకటరావు ఎమ్మెల్యేగా గెలుపొందగా ఆయన కూడా తాజాగా కాంగ్రెస్ లో చేరడంతో గులాబీ పార్టీ ఉమ్మడి జిల్లాలో కుప్పకూలి నట్లయింది. దీంతో త్వరలోనే జరుగనున్న పార్లమెంటు ఎన్నికలు రసవత్తరంగా మారాయి.